క్లుప్తంగా

కంట్రోల్ రూమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల టౌన్ : కంట్రోల్ రూమ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నీటి సరఫరా, వీధిలైట్లు, భూగర్భ డ్రైనేజీల సమస్యలు తెలిపేందుకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ నెంబరు 08568-295020, (వాట్సాప్ నెంబర్-7093917530)లకు సమాచారం అందించాలన్నారు. మున్సిపాలిటీ, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయ పట్టాభిషేక మహోత్సవం

పులివెందుల టౌన్ : విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా శ్రీకృష్ణదేవరాయలకు పట్టాభిషేకం జరిగిన రోజు సందర్భంగా ప్రతీ ఏడాది ఆ మహనీయుని స్మరించుకుంటూ పట్టాభిషేక మహోత్సవాన్ని జరుపుకుంటారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక పూలఅంగళ్ల సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజ సంఘ నాయకులు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరపాలని వినతి

సింహాద్రిపురం : మండలంలోని 38 స్కూళ్లలో గురువారం జరిగే స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా జరగడానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని మండల తహసీల్దార్ గుర్రప్ప, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఎస్ఐకు బుధవారం ఎంఈఓ ఓబులేసు వినతి పత్రం అందజేశారు. అలాగే ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరగడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

చింతకొమ్మదిన్నె : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గంగమ్మతల్లి ఆలయ ఆవరణలో బుధవారం ఆయన ఉపాధి హామీ పథకం కింద అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల రూరల్ : వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బాలాజీ తెలిపారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని మోట్నూతల పల్లి గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ఆయన సిబ్బందితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దోమల పెరుగుదల, నియంత్రణ, సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కొండాపురం సీఐగా మహమ్మద్ రఫీ

కొండాపురం : స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా మహమ్మద్‌రఫీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నమయ్య జిల్లా నుంచి సీఎస్‌డీ నుంచి బదిలీలో భాగంగా కొండాపురంకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు ఎమైనా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైన సరే గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తాం

వేంపల్లె : శాంత్రి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం వేంపల్లె సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారిస్తామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటామని, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

జమ్మలమడుగు : డిపో మేనేజర్ కండక్టర్, డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.శివారెడ్డి, రీజనల్ కార్యదర్శి సుధాకర్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎన్ఎంయూఏ నాయకుడు బ్రహ్మం అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అధికారుల తీరు మారకపోతే రీజనల్ స్థాయిలో డిపోల ముందు ధర్నాలను నిర్వహిస్తామన్నారు.

ఒకరిపై ఒకరు ఆరోపణలు

కొండాపురం : మండలంలోని ఓబన్నపేట ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ టీచ్చర్‌గా పనిచేస్తున్న డేరా జ్యోతి, అభ్యుదయ మానవ హక్కుల అవగాహన జాతీయ చైర్మన్ రామాంజనమ్మలు సోషియల్ మీడియాలో ఒకరిపై ఒకరి ఆరోపణలు వైరల్ అవుతున్నాయి. జ్యోతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఇచ్చే గుడ్లు, పాలు అమ్ముకొంటోందని కడప ప్రజా ఫిర్యాదుల వేదికలో రామాంజనమ్మ ఫిర్యాదు చేసింది. రామాంజమ్మకు రూ.70 వేలు డబ్బులు, చీరలు ఇచ్చానని ఆవి అడిగినందుకు తన పై ఆరోపణలు చేసిందన్నారు.

జన వాక్కు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన కలెక్టర్, ఎస్పీల సమావేశంలో ఇంటింటికి రేషన్ పథకం రద్దుకు ఆమోదం తెలపడంతో వృద్ధులు, వికలాంగులు, కూలిపనులు చేసుకునే వారికి ఇబ్బందులు తప్పడంలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అవ్వాతాతలు, వికలాంగులు, కూలిపనులు చేసుకునేవారు ఎక్కడా ఇబ్బంది పడకూడదని ఇంటివద్దకే రేషన్ పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటికి రేషన్ పంపిణీ ఆపడం ధారుణం... పులివెందుల

రేషన్ షాపులకు వెళ్లాలంటే ఇబ్బందులు



పులివెందుల పట్టణంలోని గుంత బజారులో మేము నివాసముంటున్నాం. మేము గతంలో నగరిగుట్టలో నివాసముండేవాళ్లం. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో గుంత బజార్‌లో ఉన్న మాకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ అందించేవారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక రేషన్ షాపులు ఏర్పాటు చేయడం వల్ల గుంత బజారు నుంచి నగరిగుట్టలో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడుతున్నాం. అంతేకాక ఆటో చార్జీలు రూ.100లు అవుతున్నాయి.

– మాబున్ని, లబ్ధిదారురాలు, పులివెందుల.

మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో ఉన్నా..



ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం తెచ్చుకోవాలంటే తీవ్ర బ్బందులు పడాలి. మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో ఉన్నా. డీలర్ల ఇళ్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలంటే అవస్థలు పడాల్సిందే. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం ఇంటి వద్దకే వచ్చేవి. మాలా నడవలేని వారికి గత ప్రభుత్వంలోనే బాగుండేది. మాకు కష్టాలు తప్పవా.. మమ్ములను ఆదుకునేవారు లేరా.. మా లాంటివారి గురించి ఆలోచించు చంద్రబాబునాయుడు..

– వరలక్ష్మి, గొందిపల్లె, వేముల

బండ్లను ఆపితే.. ఇబ్బందులు పడాల్సిందేనా..



గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో నిత్యావసర సరుకుల పంపిణీ వాహనాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడం బాధాకరం. దీంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. బాబుగారు కొద్దిగా ఆలోచించండి..

– కళ్యాణి, బోనాల,లింగాల

గతంలో మాదిరిగానే బియ్యాన్ని అందించాలి



గత ప్రభుత్వ హయాంలో మాదిరిగానే రేషన్ బియ్యాన్ని ఇంటింటికి అందించాలి. రేషన్ బియ్యానికి వెళ్లాలంటే రేషన్ షాపు వద్ద గంటల తరబడి వేచి ఉండాలి. అంతేకాకుండా రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే ఆటో బాడుగలు అదనపు ఖర్చులు అవుతాయి. దీంతో చాలా ఇబ్బందులు ఉంటాయి. రేషన్ బియ్యం కోసం అదేపనిగా ఒక మనిషి పనిమానుకోవాల్సి వస్తుంది.

-సులోచన, వేంపల్లె

రేషన్ షాపుల కోసం వెతకాలి..



అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని కొనసాగించాలి. ఆ పథకం ద్వారా ఇళ్లలో ఉన్న వృద్ధులు బండి వద్దకు వెళ్లి రేషన్ తీసుకునేవారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత రేషన్ షాపులు ఎక్కడ ఉన్నాయో తెలియకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొవాలి. అందువల్ల వృద్ధులను, వికలాంగులను ఇబ్బందులు పెట్టకుండా పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేస్తే మంచిది.

– సలార్‌బీ, లబ్ధిదారురాలు, పులివెందుల

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణుల ఆధ్వర్యంలో చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్, మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

రాయలసీమకు ప్రాధాన్యత ఏదీ..



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు గాలి చంద్ర

ఎర్రగుంట్ల : రాష్ట్ర జలవనరుల శాఖ రూపొందించిన ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో రాయలసీమ ప్రాజెక్టులు లేకపోవడం చాలా విచారకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. బుధవారం ఎర్రగుంట్ల మార్క్స్ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర జలవనరుల శాఖ రూపొందించిన ఐదు ప్రాజెక్టుల పూర్తికి రూ.8,734 కోట్లు వ్యయంతో 1.71 లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు, 14 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చేయబోయే ప్రాజెక్టుల జాబితాలో రాయలసీమలోని గాలేరి నగరి, హంద్రీ నీవా, తెలుగుగంగ కేసీ కెనాల్ ప్రస్తావనే లేకపోవడం విచారకరమన్నారు. కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన రాయలసీమలో నీటి పారుదుల ప్రాజెక్టులు లేకపోడం వల్ల వర్షాలపై ఆధారపడి రైతులు నష్టపోతున్నారన్నారు. హక్కుల అవకాశాలు కోల్పోయిన రాయలసీమను విస్మరిస్తే రైతుల పక్షాన నిలబడి సీపీఐ ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి భవాని శంకర్, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.వరప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటల్లో పాటించాల్సిన పద్ధతుల గురించి బుధవారం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ రమణారెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంట యాజమాన్య పద్ధతుల గురించి, పంటల్లో పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటం, పంట నష్టం జరిగే పరిస్థితులు ఉంటే ఏయే మందులు పిచికారీ చేయాలన్న దానిపై చర్చించడం జరిగిందన్నారు. ముఖ్యంగా పచ్చదోమ, తామరపురుగులు, తెల్లదోమ నివారణకు థియోమెతోక్సమ్ 0.4గ్రాము లీటరు నీటికి లేదా డిఫెంతురియన్ 1.5గ్రాము లేదా ఫిప్రోనిల్ 2ఎంఎల్ లేదా ఫ్లోనికామిడం 0.2 గ్రాము లేదా ఆఫీదోవెరొఫెన్ 2ఎంఎల్ పిచికారీ చేసి అదుపులో ఉంచుకోవచ్చన్నారు. అలాగే శాఖపరమైన వివిధ పథకాల గురించి, ఇ పంట ద్వారా ప్రస్తుతం సాగుచేసిన పంటల నమోదు కార్యక్రమం గురించి వివరించారు. ఈనెల ఆఖరిలోపు పంట నమోదును పూర్తి చేయాలని, ప్రతీరోజు పొలాలు పరిశీలించి రైతుసేవ కేంద్రం పరిధిలో ఉన్న సమస్యలు మా దృష్టికి తీసుకువచ్చి ఎప్పటికప్పుడు రైతులకు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్య, పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్త సాయిమహేశ్వరి, ఏఓలు, డివిజన్ స్థాయి రైతు సేవా కేంద్రం ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

మట్టిప్రతిమలతోనే వినాయక చవితి చేసుకుందాం

పులివెందుల టౌన్ : వినాయక చవితికి మట్టి ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడుకుందామని సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ రమణారెడ్డిల ఆధ్వర్యంలో వినాయక చవితి మట్టి ప్రతిమల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ప్లాస్ట్ ఆఫ్ పారిస్‌లో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం వంటి హానికర రసాయనాలు ఉండడం వల్ల అలాంటి విగ్రహాల తయారీని మానేద్దామన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



పుట్టమట్టితో ఆలయానికి వస్తున్న గ్రామస్తులు

పులివెందుల టౌన్ : స్థానిక పెద్దరంగాపురంలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మతల్లి దేవస్థానంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు వెల్లాల సీతారామశర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ ప్రారంభించి పుణ్యాహావచనం, కంకనధార, పంచగవ్యప్రాస, కలశస్థాపన, యంత్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, నవగ్రహారాధన, అగ్నప్రతిష్ట, దీక్షాహోమం, శ్రీసూక్తి హోమం, జలాదివాసం నిర్వహించి మహామంగళహారతులు ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గ్రామస్తులందరు పెద్ద ఎత్తున తరలివెళ్లి పుట్టమట్టిని ఆలయానికి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని తమ హస్తాలతో ఎత్తుకుని జలాదివాసం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే రెండవ రోజు గురువారం రాత్రి దేవస్థాన సమీపంలో గ్రామస్తుల సహకారంతో చెక్కభజన గురువు సాంబశివుడు ఆధ్వర్యంలో గజ్జలపూజ నిర్వహించనున్నారు.

ఆరోగ్యం, పరిశుభ్రత పాటించాలి



ఆరోగ్య కరపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్

పులివెందుల టౌన్ : విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ఆరోగ్యం, పరిశుభ్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా లెప్రసీని గుర్తించడం ఎలా.. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి అందించే ప్రభుత్వ పథకాల గురించి, గర్భిణులకు అందించే ప్రోత్సాహకాల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య విషయాలను హెల్త్ సెక్రటరీల ద్వారా తెలుసుకుని 10 మందికి తెలియజేసి సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఉదయ్‌కిరణ్, మెడికల్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

ఎర్రగుంట్ల : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలను తాపిస్తే బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని జనవిజ్ఞానవేదిక జిల్లా సమతా కో-కన్వీనర్ హన్నా ఎస్టేర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వినాయకనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సలను వారు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నైపుణ్యం, ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి

వేంపల్లె : విద్యార్థులకు నైపుణ్యంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 19 నుంచి సాలిడ్ ఎడ్జ్, సీఎస్సీ మెషినింగ్, రెవిట్ ఆర్కిటెక్చర్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఎలక్ట్రికల్ క్యాడ్, పీఎల్సీ ప్రోగ్రామింగ్ కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత గూగుల్ ఫార్మ్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి



కుండా రామయ్యకు నివాళులు అర్పిస్తున్న చేనేత నాయకులు

జమ్మలమడుగు : చేనేత కార్మికుల కష్టాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బడిగించల చంద్రమౌళి కోరారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మోరగుడి మూడు రోడ్ల క్రాసింగ్ వద్ద ఉన్న చేనేత నాయకుడు కుండా రామయ్య విగ్రహానికి నివాళులు అర్పించారు. చేనేత కార్మికుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతుందన్నారు. ముడి సరుకుల ధరలు పెరిగిపోయాయని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు.

పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి



వరి నాట్లు వేస్తున్న రైతులు, అధికారులు

కమలాపురం : ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహించే పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మీరాపురం గ్రామంలో రైతు కృష్ణారెడ్డి పొలంలో బుధవారం చేపట్టిన జీఏపీ పొలంబడి కార్యక్రమానికి వారు హాజరయ్యారు. శాస్త్రీయ పద్ధతిలో వరినాట్లు వేయించారు. అధిక దిగుబడులు సాధించేందుకు తగిన సలహాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరినాట్లు వేసే సమయంలో నారు కొనలు తుంచి నాటాలన్నారు. తద్వారా వరిలో కాండం తొలుచు పురుగును నివారించవచ్చన్నారు. అలాగే వరి పంటలో ప్రతి 2 మీటర్లకు 30 సెం.మీ. చొప్పున కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన పంటకు గాలి వెలుతురు బాగా అందటంతో పాటు సుడిదోమను నివారించవచ్చన్నారు. ఎరువుల యాజమాన్యాన్ని చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లో పైపాటుగా ఎరువులను వినియోగించరాదన్నారు. యూరియాను మూడు విడతలుగా పంటకి వేసుకోవాలన్నారు. భాస్వరం, పొటాష్‌లను నాట్ల సమయంలో మొత్తం వేసుకోవాలన్నారు. వరి నాట్లు వేసిన మూడు రోజుల తర్వాత ఎండిపోతున్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. నీటి లవణ శాతం 2-3 ఉన్నపుడు మాత్రమే సాధారణ పెరుగుదల ఉంటుందన్నారు. 8-10 శాతం ఉండటం వలన వరి నాట్లు చనిపోతున్నాయని, వాటి నివారణకు వరి నాట్లు వేసిన 3 రోజుల తర్వాత 19:19:19 ఎరువు 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. రైతు కృష్ణారెడ్డి మాట్లాడుతూ జీలగ పంటను వేసి 50 శాతం పూత దశలో నేలలో కలియదున్నానన్నారు. అలాగే దుక్కిలో 20 కేజీల జింక్ సల్ఫేట్‌ను కూడా వేశానని తన అనుభవం తెలిపాడు.

జమ్మలమడుగు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హుస్సేన్ పీరా



జమ్మలమడుగు : స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బుధవారం జమ్మలమడుగు డీఎస్పీగా జి.హుస్సేన్ పీరా బాధ్యతలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు ఆయన స్వాగతం పలికారు. డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రతి ఒక్కరు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న యశ్వంత్ ముఖ్యమంత్రి భద్రతా డీఎస్పీగా వెళ్లారు.

సిబ్బంది లేక రైతుభరోసా కేంద్రం మూత



బొందలకుంటలో మూతబడిన ఆర్బీకే

ముద్దనూరు : మండలంలోని బొందలకుంట గ్రామంలోని రైతు భరోసా కేంద్రం బుధవారం సిబ్బంది లేకపోవడంతో మూతబడింది. పలువురు రైతులు రైతుభరోసా కేంద్రం వద్దకు పనుల నిమిత్తం వెళ్లారు. అక్కడ ఆర్బీకే తలుపులకు తాళంవేసి వుండటంతో రైతులు వెనుతిరిగివెళ్ళారు. ఉదయం నుంచి రైతు భరోసా కేంద్రం మూతబడిందని, వ్యవసాయ సీజన్‌లో రైతులకు అందుబాటులో వుండాల్సిన సిబ్బంది విధుల్లో లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్బీకేలపై పర్యవేక్షణ కొరవడిందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



కొండాపురం మాదవ కృష్ణారెడ్డి



వీఎన్‌పల్లె లక్ష్మిదేవి



చింతకొమ్మదిన్నె నాగేశ్వరరావు



చక్రాయిపేట విజయకుమారి



వేంపల్లె హరినాథ్‌రెడ్డి



పెండ్లిమర్రి అనూరాధ

కొండాపురం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్‌గా మాదవ కృష్ణారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీలో భాగంగా డోన్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తూ ఇక్కడి బదిలీపై వచ్చారు. సిబ్బంది, ప్రజల సహకారంతో రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వీఎన్‌పల్లె తహసీల్దార్‌గా లక్ష్మిదేవి..

వీరపునాయునిపల్లె : మండల తహసీల్దార్‌గా బుధవారం లక్ష్మిదేవి బాధ్యతలు చేపట్టారు. సిద్దవటం నుంచి వీరపునాయునిపల్లెకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెల్లారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

సీకే దిన్నె తహసీల్దార్‌గా నాగేశ్వరరావు..

చింతకొమ్మదిన్నె : మండల నూతన తహసీల్దారుగా ఎ.నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎర్రగుంట్ల మండలంలో పనిచేస్తూ ఎన్నికల విధుల్లో భాగంగా రేణిగుంటకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం చింతకొమ్మదిన్నెకు బదిలీపై వచ్చారు.

చక్రాయపేట తహసీల్దారుగా విజయకుమారి

చక్రాయపేట : మండల తహసీల్దారుగా విజయకుమారి బుధవారం బాధ్యతలను చేపట్టారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు వెంకటరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

వేంపల్లె తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి

వేంపల్లె : మండల తహసీల్దార్‌గా హరినాథ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రెవె న్యూ సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు ఆయన ను సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ శివలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి తహసీల్దార్‌గా అనూరాధ

పెండ్లిమర్రి : మండల తహసీల్దార్‌గా అనూరాధ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు రగునాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : వర్షాభావ పరిస్థితుల వలన పంటలు పూర్తిగా దెబతిన్నాయని పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. బుధవారం మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన సబాధ్యక్షుడిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన మినుము, వేరుశనగ పంట వర్షాలు లేక పూర్తిగా ఎండిపోవడంతో చాలా మంది రైతులు పంటను దున్నేస్తున్నారన్నారు. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పంట నష్టాన్ని అందించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరముందని తీర్మాణించారు. సభ్యులందరూ ఆమోదం తెలియజేశారు. మండలంలో పండ్లతోటల పెంపకం అధికంగా ఉందని కావున ప్యాక్ హౌస్‌లు నిర్మాణంపై ఆర్టికల్చర్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మూడు నెలలకొకసారి జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆలస్యంగా హాజరుకావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం శాఖల వారిగా చేపడుతున్న కార్యక్రమాల వివరాలను సభ ముందుంచారు. మండల విద్యాశాఖాధికారి జాఫర్ సాదిక్ మాట్లాడుతూ మండలంలో ఇద్దరు పిల్లలు, సింగల్ టీచర్ ఉన్న పాఠశాలలు 10 ఉన్నాయని ఆ పాఠశాలల్లోని పిల్లలను ఇతర పాఠశాలలోకి పంపించి 10 పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. రద్దయిన పాఠశాలల్లో 10 మంది పిల్లలు ఉండేటట్లు గ్రామస్తులు సహకరిస్తే మూసివేయకుండా ఉండేందుకు వీలుంటుందన్నారు. ఆర్టికల్చర్ అధికారి రెడ్డెయ్య మాట్లాడుతూ 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు 90 శాతం, 10 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు 70 శాతం రాయితీతో డ్రిప్ మరియు 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు 55 శాతం, 10 ఎకరాలలోపు భూమి ఉన్న రైతుకు 45 శాతం స్ప్రింక్లర్‌లను అందజేస్తారన్నారు. ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ట్యాంకులను శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. త్వరలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభమవుతుందని కార్యక్రమం చేపట్టేందుకు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ లక్ష్మిదేవి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధకారులు పాల్గొన్నారు.